


వికారాబాద్ పట్టణంలో..



యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో..

# శాకాంబరీదేవిగా అమ్మవారు

వికారాబాద్, ఆగస్టు 2 : వికారాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ శ్రీరామ మందిరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు, శాకంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. మన ఊరు మనసారే కార్యక్రమంలో భాగంగా కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేశ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మాలే లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి యాష్కి సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడు ఈరెల్లి రఘునందన్, కోశాధికారి దోమ శ్రీకాంత్, సహాయ కార్యదర్శి మ్యాడం వేణుగోపాల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు యాష్కి శిరీష, మహిళా సంఘం అధ్యక్షురాలు మ్యాడం లక్ష్మి, ప్రధాన కార్యదర్శి యాష్కి సువర్ణ, ఉపాధ్యక్షురాలు కొట్టి విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి కుంచం శ్రీదేవి, కోశాధికారి పోకల మమత, ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

## యాచారం మండలంలో..

యాచారం, ఆగస్టు 2 : మండలంలోని నందివనపర్తి గ్రామంలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆషాఢ మాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని మాతృమండలి సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీ దేవిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అమ్మవారు శాకాంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో సామూహిక లలితాసహస్ర నామ పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## చేవెళ్ల మండలంలో..

చేవెళ్ల టౌన్, ఆగస్టు 2 : ఆషాడం చివరి శుక్రవారం కావడంతో చేవెళ్ల మండల కేంద్రంలోని కొనగట్టుపైన వెలిసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమానికి గ్రామస్తులతోపాటటు చుట్టుపక్కల, గ్రామాల భక్తులు, దూర ప్రాంతాల నుంచి సైతం తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ఆశీస్సులు పొందినట్లు దేవాలయ ప్రధాన అర్చకులు జీఎం సురేశ్‌కుమార్ తెలిపారు.



చేవెళ్లలో పూజలు చేస్తున్న భక్తులు

# క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

ఇతర రాష్ట్రాల వాహనాలపై చర్యలేవి?

నిబంధనలు అతిక్రమించి రాకపోకలు

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నాలుగురోజులుగా క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాలు క్యాబ్ సర్వీస్‌ను అందించడంపై తెలంగాణ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహన ట్యాక్సీలు చెల్లించి క్యాబ్‌లు నడిపిస్తుంటే, ఎలాంటి పన్నులు చెల్లించకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ వందల సంఖ్యలో తిష్టవేసి తెలంగాణ డ్రైవర్లకు నష్టం చేకూరుస్తున్నారని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ ఫౌండర్ షేక్ సలా ఉద్దీన్ చెప్పారు. పలుమార్లు ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన డ్రైవ్ చేపట్టడం లేదని విమర్శించారు. కాగా, శుక్రవారం డ్రైవర్ల ఆందోళనపై రవాణా, ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో డ్రైవర్లతో చర్చలు జరిగాయి. రవాణా శాఖకు నష్టం చేకూర్చే ఇతర రాష్ట్రాల వాహనాలపై చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు షేక్ సలా ఉద్దీన్, నగేశ్ కుమార్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇతర రాష్ట్రాల వాహనాలు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు సీజ్ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# యూనివర్సిటీలకు వీసీలను నియమించండి

● ఓయూలో ఏబీవీపీ ఆందోళన ● రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మతో రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: ఉస్మానియా యూనివర్సిటీలో మరోసారి ఉద్రిక్తత తలెత్తింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని, సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఆందోళన పోలీసులకు విద్యార్థులకు మధ్య బాహాబాహీకి దారితీసింది. వర్సిటీలపై వివక్షకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం, దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీల పదవీ కాలం ముగిసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇన్‌చార్జి వీసీలతో కాలయాపన చేస్తూ వర్సిటీల మనుగడకే ముప్పు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలోని వర్సిటీలకు మహర్దశ తీసుకువస్తామని అన్నట్టు గుర్తు చేశారు. కానీ, ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటి వరకు వర్సిటీల సంక్షేమం గురించి మాట్లాడిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు.

వర్సిటీలలో ఖాళీగా ఉన్న 82 శాతం టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమవుతున్న వర్సిటీ భూములను కాపాడాలని కోరారు. అశాస్త్రీయంగా పెంచిన పీజీ, ఇంజినీరింగ్, పీహెచ్‌డీ ట్యూషన్, ఎగ్జామ్ ఫీజులను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి మెరుగైన హాస్టల్ వసతి కల్పించాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ పృథ్వీతేజ, స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు శ్రీహరి, కమల్ సురేశ్, నాయకులు సుమన్ శంకర్, రాజు పాల్గొన్నారు.

# రైతులు మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి

చేవెళ్ల టౌన్, ఆగస్టు 2 : రుణమాఫీ అయిన రైతులు మళ్లీ కొత్త రుణాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి తెలిపారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో రుణమాఫీకి సంబంధించి రైతులతో సమావేశం నిర్వహించారు. రుణమాఫీ అయిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ అయిన రైతుల క్రాప్ లోను రెన్యూవల్ వివరాలను బ్యాంక్ అధికారులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. ఆగస్టు ఐదో తేదీ లోపు అర్హత కలిగిన ప్రతి రైతు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారిణి తులసి, ఏఈవోలు బాలకృష్ణ, రమేశ్, వరుణ్, రైతులు మల్గారి లక్ష్మారెడ్డి, అల్లాడ భోజిరెడ్డి ఉన్నారు.



రైతుతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి గీతారెడ్డి

# రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్లటౌన్, ఆగస్టు 2: అర్హులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య తెలిపారు. చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల భారత కమ్యూనిస్టు పార్టీ కౌన్సిల్ నిర్మాణ మహాసభను మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి జంగయ్య హాజరై మాట్లాడుతూ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీని వర్తింపజేయాలని, అదేవిధంగా పెంచి ఇస్తామన్న పింఛన్‌ను, కౌలు రైతులకు రైతు భరోసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రోజు నిర్వహించిన భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో నాలుగు మండలాలకు సంబంధించిన మండల కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల కార్యదర్శిగా ఎం సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎండీ మక్బూల్, వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యదర్శిగా కే శ్రీనివాస్, శంకర్‌పల్లి మండల కార్యదర్శిగా సుధీర్, షాబాద్ మండల కార్యదర్శిగా, నక్క జంగయ్యను, అదేవిధంగా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జే అంజయ్య, నాలుగు మండలాల కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

# మొగిలిగిద్దను మండలం చేయండి

శాసనమండలిలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

షాద్‌నగర్, ఆగస్టు 2 : షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలంలో ప్రధాన గ్రామ పంచాయతీగా ఉన్న మొగలిగిద్ద గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర శాసనమండలి సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. మండల ఏర్పాటుకు సరిపడా మౌలిక వసతులు గ్రామంలో ఉన్నాయని, మొగలిగిద్ద గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడంతో పాటు చారిత్రాత్మక ఆనవాళ్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు అనువైన ప్రభుత్వ స్థలం ఉన్నదన్నారు. గతంలో పోలీస్ స్టేషన్ ఉండేదని, 150 ఏండ్ల చరిత్ర కలిగిన విద్యా సంస్థలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, పౌర హక్కుల నేత హరగోపాల్ వంటి ఎంతో మంది మేధావులు ఈ గ్రామంలో విద్యను అభ్యసించారన్నారు. రవాణా వ్యవస్థ కూడా బలోపేతమైందని మండల ఏర్పాటుకు ఈ గ్రామం అనువుగా ఉంటుందని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మాదాసి కురువలు ఎస్సీ సర్టిఫికెట్లను పొందేందుకు శాఖాపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, మాదాసి కురువల ఎస్సీ సర్టిఫికెట్ల జారీపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్సీ ప్రస్తావించిన సమస్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాసనమండలిలో ప్రత్యేక మండలంతో పాటు, మాదాసి కురువల సమస్యలను ప్రస్తావించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

# యువసత్తా లక్ష్మణ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న యువసత్తా అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్

నందిగామ/షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 2 : నందిగామ గ్రామానికి చెందిన లక్ష్మణ్ కుమార్ యువసత్తా యువజన సంఘం గత 30 ఏండ్ల కింద ఏర్పాటు చేశారు. యూత్ అధ్యక్షుడిగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడంతో అన్నా ఫౌండేషన్ సంస్థ గుర్తించింది. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ప్రొఫెసర్ భాగ్యలక్ష్మి శుక్రవారం లక్ష్మణ్ కుమార్‌కు అవార్డును అందజేశారు.

# చల్లంగ చూడు తల్లీ..

## ఘనంగా బోనాల ఉత్సవాలు.. మొక్కులు చెల్లించుకున్న భక్తులు



అప్పాయిపల్లి గ్రామంలో బోనాల ఊరేగింపు

కొడంగల్, ఆగస్టు 2: మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని శుక్రవారం పోచమ్మ తల్లి బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు చేశారు.

## ఖానాపూర్, తట్టెపల్లి గ్రామాల్లో..


పెద్దేముల్, ఆగస్టు 2 : ఖానాపూర్ గ్రామస్తులు రక్త మైసమ్మకు బోనాలు ఉత్సవాన్ని నిర్వహించారు. మహిళలు ప్రత్యేక బోనాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. చల్లంగా చూడు అమ్మోరు తల్లీ.. అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

## కులకచర్లలో..

కులకచర్ల, ఆగస్టు 2 : కులకచర్ల మండల కేంద్రంలో శుక్రవారం పోచమ్మ తల్లి బోనాల పండుగ వైభవంగా జరిగింది. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవాకి నైవేద్యం సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చాలని, ఈ ఏడాది పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.



పెద్దేముల్ మండలంలోని ఖానాపూర్ గ్రామంలో రక్త మైసమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



కులకచర్ల లో పోచమ్మ దేవాలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

# రైతులకు రుణమాఫీ అందించాలి

కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన రైతులు

వికారాబాద్, ఆగస్టు 2 : పంట రుణమాఫీని అర్హులందరికీ అందించాలని శుక్రవారం పలువురు రైతులు కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వికారాబాద్ పట్టణంలోని కెనరా బ్యాంకులో రైతులు రుణాలు తీసుకున్నారు. కొందరు రెన్యూవల్ చేసుకోగా, బ్యాంకు సిబ్బంది ప్రభుత్వానికి సరైన నివేదిక ఇవ్వకపోవడం వల్ల మాఫీ కాలేదన్నారు. అర్హులకు రుణమాఫీ వర్తించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ ఎల్‌డీఎం అధికారి, కెనరా బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొత్తగడి కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, రైతులు రాజు, నర్సింహులు, బందయ్య, అశోక్ దాదాపు 60 మంది రైతులు ఉన్నారు.

# చేవెళ్ల ప్రభుత్వ అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులకు ఆహ్వానం

చేవెళ్ల టౌన్, ఆగస్టు 2 : చేవెళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేవెళ్ల స్టడీ సెంటర్ సమన్వయకర్త షేక్ మహబూబ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–2025 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్ పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలను 9908640914 ను సంప్రదించాలని తెలిపారు.